



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 321 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 09-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# మూడోసారి కప్పు కైవసం

## ఫైనల్లో న్యూజిలాండ్‌పై ఏకపక్ష విజయం



- టీ20 ప్రపంచకప్ టైటిల్ భారత్ వశం
- శాంసన్, అభిషేక్, కిషన్ ధనాధన్
- టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఘన విజయం
- 255 పరుగుల భారీ స్కోరు, 159కే కివీస్ ఆలౌట్

అహ్మదాబాద్ మార్చి 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఐసిసి 2026 టి-20 ప్రపంచకప్ టీమ్ ఇండియా సొంతమైంది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై భారత్ 96 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. 256 పరుగుల ఛేదనలో న్యూజిలాండ్ కనీస పోటీ ఇవ్వలేదు. ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (52, 26 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (43, 35 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా ఇతర బ్యాటర్లు అందరూ విఫలమయ్యారు. భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (4/15), అక్షర్ పటేల్ (3/27) ఛేదన -మిగతా 2 లో









## 30 నెలల్లో పాలమూరు- రంగారెడ్డి పూర్తిచేస్తాం

- రాష్ట్ర వ్యాప్తంగా భూ సేకరణకు రూ.5 వేల కోట్లు కేటాయిస్తాం
- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లను నిర్లక్ష్యం చేసింది
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హైదరాబాద్ మార్చి 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను 30నెలల వ్యవధిలో పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ జలసౌధలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్ట్‌లపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ నీటి పారుదల రంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండేండ్లలోనే ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్ట్‌లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో -మిగతా 2 లో




## యుద్ధంలో క్లస్టర్ బాంబులు

- ఇరాన్‌పై ఇజ్రాయిల్ ఆరోపణలు
- టెహ్రాన్ ప్రతిదాడులను జీర్ణించుకోలేని టెల్‌అవీవ్
- అందుకే ఇలాంటి ఆరోపణలంటున్న విశ్లేషకులు
- గాజాపై రెండేండ్లుగా సాగించిన నరమేధం దేనికి నిదర్శనం?
- ఇజ్రాయిల్‌ది ద్వంద్వ వైఖరి అని వెల్లడి

న్యూఢిల్లీ

ఇరాన్‌పై దాడులకు దిగి, మధ్యప్రాచ్యంతో పాటు ప్రపంచాన్ని గందరగోళానికి గురిచేస్తున్నాయి అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు. ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీని చంపేసి, అమాయకపు పౌరుల ప్రాణాలను తీసుకుంటున్నాయి. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ, ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తూ, ఆ దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకొని మరీ యుద్ధానికి దిగాయి. అమెరికాతో కలిసి ఈ విధమైన దారుణమైన దాడులకు దిగిన ఇజ్రాయిల్ ఇప్పుడు ఒక ఆశ్చర్యకరమైన ఆరోపణ చేస్తున్నది. యుద్ధంలో భాగంగా ఇరాన్ తమపై క్లస్టర్ మ్యూనిషన్స్‌ను ఉపయోగించిందని ఆరోపిస్తోంది. మొన్నటి వరకు గాజాపై రెండేండ్లకు పైగా దాడులు చేసి వేలాది మంది ప్రాణాలను తీసుకుంది ఇజ్రాయిల్. నేడు ఇరాన్‌పై కూడా దారుణ చర్యలకు ఒడిగడుతోంది. దీంతో ఆత్మరక్షణ చర్యలో భాగంగా ఇరాన్ చేస్తున్న ప్రతిదాడులను మాత్రం ఇజ్రాయిల్ సహించలేక పోతోందనీ, ఇది ఆ దేశం ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందని విశ్లేషకులు చెప్తున్నారు. -మిగతా 2 లో

# మహిళలకు గుర్తింపు కరువు

## దేశంలో ఇంకా వివక్ష కొనసాగుతోంది అతివల నైపుణ్యాలను గుర్తించండి



- త్వరలో కాలేజీ అమ్మాయిలకు ఈవీ స్కూటీలు
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలపై త్వరలో శుభవార్త
- మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ
- దానికి రాజకీయ రంగు పులిమి సానుభూతి పొందుతున్న ప్రతిపక్షాలు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ మార్చి 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

మనదేశంలోని మహిళలకు, వారి శ్రమకు గుర్తింపు కరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై ఇంకా వివక్ష కొనసాగటం శోచనీయమని అన్నారు. అమెరికాలోనూ వివక్ష ఉందనీ, అయితే అక్కడ కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. మన దేశంలో కూడా అదే రకమైన గుర్తింపును మహిళలు కోరుకుంటున్నారని చెప్పారు. మహిళా జర్నలిస్టులు చెడును నియంత్రించడంలో తగిన పాత్ర పోషిస్తారనీ, సమాజం వారిని విశ్వసిస్తుందని తెలిపారు. ప్రపంచ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే... మహిళలు ఆర్థికంగా ఎదిగి న దేశాలే అభివృద్ధి సాధించాయని చెప్పారు. కానీ ఇండియాలో -మిగతా 2 లో

## ఇస్లామిక్ నాటో' కూటమి దిశగా అడుగులు..?




- పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ.. పాక్, సౌదీ మధ్య చర్చలు సౌదీ రక్షణ మంత్రితో
- పాకిస్తాన్ సీడీఎఫ్ ఆసిమ్ మునీర్ భేటీ
- ఇరాన్ దాడుల నేపథ్యంలో భద్రతా పరిస్థితులపై చర్చ

రియాద్:

పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం తీవ్రమవుతున్న సమయంలో పాకిస్తాన్, సౌదీ అరేబియా మధ్య భద్రతా చర్చలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఇరాన్‌లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో పాకిస్తాన్ సైన్యాధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్) ఫీల్డ్ మార్షల్ సయ్యద్ ఆసిమ్ మునీర్ సౌదీ అరేబియాకు వెళ్లి అక్కడి రక్షణ మంత్రి ప్రిన్స్ ఖాలిద్ బిన్ సల్మాన్‌తో సమావేశమయ్యారు. దీంతో 'ఇస్లామిక్ నాటో' కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయా? అన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం ఇరాన్, అమెరికా-ఇజ్రాయిల్ సంయుక్త దాడుల తర్వాత ఆ ప్రాంతంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. -మిగతా 2 లో

## రాష్ట్రపతిని అవమానించింది మీరే!

- ప్రధాని విమర్శలకు మమత కౌంటర్
- రాష్ట్రపతి నిలుచొని ఉన్న ఫొటో విడుదల



కోల్‌కతా,మార్చి 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవలి పర్యటన ఆ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అవమానించారంటూ ప్రధాని మోదీ.. మమత సర్కార్‌పై మండిపడ్డారు. ప్రధాని వ్యాఖ్యలపై ఆదివారం సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ.. గతంలో రాష్ట్రపతికి సంబంధించి ఒక ఫొటోను విడుదల చేశారు. -మిగతా 2 లో

## ఏఐను సమర్థవంతంగా వినియోగించాలి


### పోలీసు శాఖకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపు



- తెలంగాణ పోలీస్ రిట్రీట్-2026ను ప్రారంభించిన మంత్రి
- పాల్గొన్న డీజీపీ శివధర్‌రెడ్డి, మాజీ డీజీపీలు

హైదరాబాద్ మార్చి 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

మారుతున్న కాలానికి అనుగుణంగా నేర పరిశోధనలో అత్యాధునిక కత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతను పోలీసు శాఖ సమర్థవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆదివారం నాడు 'తెలంగాణ పోలీస్ రిట్రీట్-2026' ను మంత్రి ప్రారంభించారు. -మిగతా 2 లో



## నేటి నుంచి రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం చర్చ
- విప్ జారీ చేసిన అధికార, ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ మార్చి 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

: పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి తిరిగి కొనసాగనున్నాయి. ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్న ఈ సమావేశాలు పండుగలు, సెలవుల కారణంగా కేవలం 17 రోజులు మాత్రమే నిర్వహించే అవకాశం ఉంది. ఎజెండాలోని మొదటి అంశంగా లోకసభ స్పీకర్‌పై ప్రతిపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానం సహా కీలక అంశాలపై చర్చలు -మిగతా 2 లో

## మండలి'కి కొత్త శోభ

### నూతన భవనాన్ని ప్రారంభించిన సీఎం




హైదరాబాద్ మార్చి 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

అసెంబ్లీ ప్రాంగణంలో ఆధునీకరించిన తెలంగాణ శాసనమండలి భవనాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కొత్త సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, శాసనసభా వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, -మిగతా 2 లో

# యుద్ధంలో క్లస్టర్ బాంబులు

మొదటి తరువాయి

విస్తృత ప్రాంతంలో చిన్న చిన్న పేలుడు పదార్థాలను వెదజల్లే క్లస్టర్ బాంబులు అంతర్జాతీయంగా వివాదాస్పదం, చాలా ప్రమాదకరం. తాజాగా ఇజ్రాయిల్ ఆరోపణలతో ఈ ఆయుధాలపై మళ్లీ చర్చ నడుస్తున్నది. ఇజ్రాయిల్ సైన్యం తెలిపిన వివరాల ప్రకారం.. ఇరాన్ ఇటీవల జరిగిన దాడుల్లో 'క్లస్టర్ బాంబులు' అనే వివాదాస్పద ఆయుధాలను ఉపయోగించింది. ఈ బాంబులు గాల్లో పేలిపోయి చిన్న చిన్న పేలుడు పదార్థాలను విస్తృత ప్రాంతంలో వెదజల్లుతాయి. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఉపయోగించడం అంతర్జాతీయ మానవతా చట్టా లను ఉల్లంఘించే చర్యగా భావి స్తారు. యుద్ధం ప్రారంభమైన ప్పటి నుంచి ఇరాన్ పలుమార్లు క్లస్టర్ మ్యూనిషన్స్ ఉపయోగిం చిందని ఇజ్రాయిల్ సైన్య ప్రతి నిధి నాదావ్ షోషాని అన్నారు.

**ఇవి చాలా ప్రమాదకరం : నిపుణులు**

క్లస్టర్ బాంబులు చాలా ప్రమాదకర మైనవిగా నిపుణులు చెప్తున్నారు. ఇవి సాధారణ బాంబుల్లా ఒక్కసారి మాత్రమే పేలవు. బదులుగా.. గాలిలో పేలిపోయి అనేక చిన్న పేలుడు పదార్థాలు (బాంబ్లెట్స్) విస్తృత ప్రాంతంలో పడేలా చేస్తాయి. ఈ చిన్న బాంబ్లెట్స్ నేలపై పడిన వెంటనే పేలవచ్చు లేదా కొన్ని పేలకుండానే అలా నేలలో ఉండిపోవచ్చు. తర్వాత కూడా అవి ప్రమాదకరంగా మారి పౌరులకు హాని కలిగించే అవకాశం ఉంటుంది. అందుకే ఈ ఆయుధాలను ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రమాదకర మైనవిగా చూస్తున్నారు. ఇరాన్ ప్రయోగించిన ఒక క్షిపణి సుమారు ఏడు కిలోమీటర్ల ఎత్తులో పేలిపోయి, దాదాపు 20 చిన్న బాంబ్లెట్స్ సుమారు 8 కిలోమీటర్ల పరిధిలో పడిపోయినట్టు ఇజ్రాయిల్ రక్షణ దళాలు చెప్తున్నాయి. ఇలాంటి ఆయుధాలు యుద్ధంలో సైనిక లక్ష్యాలను మాత్రమే కాకుండా పౌరులను కూడా ప్రమాదంలో పడేస్తాయని విమర్శలు ఉన్నాయి. అందుకే 2008లో రూపొందించిన క్లస్టర్ మ్యూనిషన్స్ కన్వెన్షన్ అనే అంతర్జాతీయ ఒప్పందం.. వాటి వినియోగాన్ని నిషేధిం చింది. అయితే కొన్ని దేశాలు, ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయిల్ రెండూ ఆ ఒప్పందంపై సంతకాలు చేయలేదు.

## 30 నెలల్లో పాలమూరు- రంగారెడ్డి పూర్తిచేస్తాం

మొదటి తరువాయి

ఉన్న ప్రాజెక్ట్‌లకు అవసరమైన భూసేకరణ, పునరావాస పనులకు గాను (జూన్ 2 నాటికి) రూ.5వేల కోట్లు విడుదల చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కృష్ణా, గోదావరి రెండు బేసిన్లలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధిక వరి పండిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను 90 శాతం పూర్తి చేశామంటూ గత పాలకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రూ.55 వేల కోట్ల ప్రాజెక్ట్‌లో రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తే అది 90 శాతం పూర్తయినట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. వారి హయాంలో నే పాలమూరు అంచనాలను రూ.84 వేల కోట్లకు పెంచారని మండిపడ్డారు. రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి నీరివ్వలేదని ఆరోపించారు. పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల లిఫ్ట్ ఖర్చులు పెరిగి రాష్ట్రానికి నష్టం జరిగిందన్నారు. ఇదే తరహాలో కాళేశ్వరం లిఫ్ట్ ఎత్తిపోతల పథకాన్ని తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు మార్చడంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌పై రూ.7,161 కోట్లు ఖర్చు చేసినట్టు మంత్రి తెలిపారు. ఇందులో ప్రాజెక్ట్ పనులకు రూ.6,718 కోట్లు, భూసేకరణకు రూ.284.71 కోట్లు, పునరావాసానికి రూ.63.65 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.94 కోట్లు వినియోగించినట్టు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ప్రాజెక్ట్‌లను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 2014 జూన్ 2న ఎలా ఉన్నాయో 2024 జూన్ 2న కూడా అలాగే ఉన్నాయని చెప్పారు. ఎంత ఖర్చయినా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించామని చెప్పారు. కల్వకుర్తికి రూ.909 కోట్లు, నెట్టెంపాడుకురూ.252 కోట్లు, భీమాకు రూ.200 కోట్లు, కోయిలసాగర్‌కు రూ.185 కోట్లు కేటాయింపులు జరిగాయని వివరించారు.

## ఇస్లామిక్ నాటో' కూటమి దిశగా అడుగులు..?

మొదటి తరువాయి

ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాపై డ్రోన్లు, క్షిపణి దాడులు జరిగాయి. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో కొత్త భద్రతా సమీకరణాలకు దారితీస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## రాష్ట్రపతిని అవమానించింది మీరే!

మొదటి తరువాయి

'భారత రాష్ట్రపతి, గిరిజన నాయకురాలిని గౌరవించని వ్యక్తి మీరు. మేం కాదు. రాష్ట్రపతి నిల్చొని ఉంటే, ప్రధాని మోదీ కూర్చున్నారు' అని మమత కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 మార్చిలో ఎల్‌కే అద్వానీకి రాష్ట్రపతి భారతరత్న అందజేస్తున్న ఫొటోను ప్రస్తావిస్తూ, బీజేపీ ఆరోపణల్ని ఆమె తిప్పికొట్టారు.

## నేటి నుంచి రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

మొదటి తరువాయి

జరగనున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఎంపీలందరూ సభా కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశిస్తూ బిజెపి మూడు లైన్ల విప్ జారీ చేసింది. అలాగే ప్రతిపక్ష కాంగ్రెస్ సైతం ఈ నెల 11 వరకు సభకు హాజరు కావాలని ఎంపీలకు ఇప్పటికే విప్ జారీ చేసింది. ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా విప్ జారీ చేశాయి. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం, పశ్చిమాసియా దేశాల్లో దాడులు, ఇతర అంశాలపై అధికార పక్షాన్ని నిలదీసేందుకు కాంగ్రెస్‌తో పాటు మిగిలిన ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. అయితే... వెస్ట్ బెంగాల్‌లో అంతర్జాతీయ సంతల్ కాన్‌క్లేవ్ విషయంలో రాష్ట్రపతి ముర్ముకు జరిగిన అవమానం, ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతల అర్ధనగ ప్రదర్శన, ఇతర అంశాలపై విపక్షాలు టార్గెట్‌గా ఎన్‌డిఎ వ్యూహాలు అమలు చేయనుంది.

**గతంలో మూడుసార్లు..**

పార్లమెంట్ చరిత్రలో మూడుసార్లు లోక్‌సభ స్పీకర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని పెట్టినట్టు రికార్డులు చెబుతున్నాయి. 1954లో ఆనాటి తొలి స్పీకర్ బివి మావలంకర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం పెట్టాయి. అనంతరం 1966లో హుకుం సింగ్, చివరగా 1987 ఏప్రిల్ 17లో అప్పటి స్పీకర్ బలరాం జాఖర్ పై తీర్మానాలు ప్రవేశపెట్టారు. కానీ ఈ మూడు సందర్భాల్లో స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గలేదు. దీంతో వారు స్పీకర్లుగా కొనసాగారు. అయితే, స్పీకర్ ఓం బిర్లా విషయంలోనూ ఇదే కొనసాగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకుంటే ప్రస్తుతం లోక్‌సభలో 543 స్థానాలకు గానూ ఎన్డీఏ కూటమికి 335, ఇండియా బ్లాక్ 230 ఎంపిల సంఖ్యాబలంతో ఉన్నాయి. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 94 (సి) ప్రకారం స్పీకర్‌ను తొలగించేందుకు కావాల్సిన సంఖ్యాబలం ఇండియా బ్లాక్ వద్ద లేదనే చెప్పాలి. తాజాగా 2024లో ఆనాటి రాజ్యసభ చైర్మెన్ (ఉపరాష్ట్రపతి) జగదీప్ దన్‌ఖర్‌పై ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం పెట్టింది. 2024 డిసెంబర్ 10న దన్‌ఖర్ తొలగింపు నోటీసుపై కనీసం 60 మంది ప్రతిపక్ష సభ్యులు సంతకం చేశారు. అయితే, డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ ఈ తీర్మానాన్ని తోసిపుచ్చారు.

## మండలి'కి కొత్త శోభ

మొదటి తరువాయి

మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, గడ్డం వివేక్, మహ్మద్ అజారుద్దీన్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, రాజ్యసభ సభ్యులు వేంనరేందర్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాసనమండలిలోని తన ఛాంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా పూజచేశారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం అక్కడి నుంచి మహిళా జర్నలిస్టులతో ఉమెన్స్ డేలో పాల్గొనేందుకు ప్రజాభవన్‌కు వెళ్లిపోయారు. 1905లో నిర్మితమైన ఈ టౌన్ హాల్ భవనం రాజస్తాన్, పర్షియన్ శైలిలో సుందరంగా నిర్మించారు. చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఈ భవనం అప్పట్లోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, శాసనమండలి ఒకే ప్రాంగణంలో కొనసాగేవి. అయితే, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ రెండు వేర్వేరు భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శాసన కార్యకలాపాలు ఒకే ప్రాంతంలో ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రక వారసత్వాన్ని కాపాడే దిశగా చర్యలు చేపట్టారు.

# మూడోసారి కప్పు కైవసం

మొదటి తరువాయి

ఆరంభంలోనే న్యూజిలాండ్ నడ్డి విరిచారు. పవర్‌ప్లేలోనే భారత్ విజయాన్ని ఖరారు చేశారు. 19 ఓవర్లలో 159 పరుగులకు న్యూజిలాండ్ కుప్పకూలింది. అంతకముందు, తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ టాప్-3 బ్యాటర్లు విశ్వరూపం చూపించగా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోరు చేసింది. సంజు శాంసన్ (89, 46 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (54, 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (52, 21 బంతుల్లో 6 ఫోరుల, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. శివం దూబె (26 నాటౌట్, 8 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆఖర్లో అదరగొట్టాడు. కివీస్ పేసర్ జేమ్స్ నీషమ్ (3/46) రాణించాడు.

**టాప్‌గేర్‌లో టాప్-3 :**

టాస్ ఓడిన భారత్ తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. ఆచితూచి ఆడిన సంజు శాంసన్ (89) సిక్సర్‌తో పరుగుల వేట షురూ చేశాడు. వరుస వైఫల్యాలతో ఒత్తిడిలో పడిన అభిషేక్ శర్మ (52) సైతం నెమ్మదిగానే ఇన్నింగ్స్‌ను ఆరంభించాడు. దీంతో తొలి రెండు ఓవర్లలో 12 పరుగులే వచ్చాయి. మూడో ఓవర్లో మొదలైన తుపాన్.. పవర్‌ప్లేలోనే కివీస్ బౌలర్లను ముంచెత్తింది. అభిషేక్ శర్మ, సంజు శాంసన్




శివమెత్తగా.. వరుస ఓవర్లలో 24, 21, 20 పరుగులు పిండుకున్నారు. దీంతో పవర్‌ప్లేలోనే భారత్ 92/0తో నిలిచింది. ఆఫ్ స్పిన్ బలహీనత అధిగమిస్తూ పేసర్లపై పంజా విసిరిన అభిషేక్ శర్మ 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 18 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. సంజు శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 43 బంతుల్లోనే 98 పరుగులు జోడించారు. భారత్ భారీ స్కోరుకు బలమైన పునాది వేశారు. అభిషేక్ శర్మ నిష్క్రమించినా.. భారత్ దూకుడు తగ్గలేదు. సంజు శాంసన్‌కు తోడైన ఇషాన్ కిషన్ (54) రెండో వికెట్‌కు 48 బంతుల్లోనే 105 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 23 బంతుల్లోనే ఇషాన్ కిషన్ అర్ధ సెంచరీ సాధించగా.. సంజు శాంసన్ 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 33 బంతుల్లో ఫిఫ్టీ అందుకున్నాడు. టాప్-3 బ్యాటర్ల ధనాధన్‌తో భారత్ 15 ఓవర్లలోనే 200 పరుగుల మైలురాయి దాటింది. ఇన్నింగ్స్ 16వ ఓవర్లో జేమ్స్ నీషమ్ గొప్పగా బౌలింగ్ చేశాడు. సంజు శాంసన్, ఇషాన్ కిషన్ సహా సూర్యకుమార్ యాదవ్ (0)ను అవుట్ చేశాడు.

**ఆఖర్లో శివం షో :**

జేమ్స్ నీషమ్ ఓ ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టగా.. భారత్ స్కోరు నెమ్మదించింది. 16-19 ఓవర్లలో భారత్ 28 పరుగులే (24 బంతుల్లో) చేసింది. 300 స్కోరుపై అభిమానులు ఆశలు పెట్టుకోగా.. 250 కొట్టినా సంతోషమే అనిపించింది. ఆఖరు ఓవర్లో శివం దూబె (26 నాటౌట్) శివమెత్తాడు. ఫోర్లు, సిక్సర్లతో దంచికొట్టాడు. చివరి 6 బంతుల్లో 24 పరుగులు పిండుకున్నాడు. దీంతో భారత్ 255 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్య (18, 13 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), తిలక్ వర్మ (8 నాటౌట్, 6 బంతుల్లో) ఫర్వాలేదనిపించారు.

# మహిళలకు గుర్తింపు కరువు

మొదటి తరువాయి

అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం తరపున ఒక వ్యవస్థగా మహిళలకు సమున్నత స్థానం కల్పిస్తున్నామని సంతృప్తిని వ్యక్తం చేశారు. మహిళల్లోని నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్సహించాలంటూ సంస్థలకు, కంపెనీలకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్ లోని ప్రజా భవన్‌లో సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...మహిళలకు తమ పార్టీ మొదటి నుంచి ఎనలేని గౌరవాన్ని, గుర్తింపును ఇచ్చిందన్నారు. రాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్ పదవుల్లో మహిళలను కూర్చోబెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని తెలిపారు. అనేక రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులుగా మహిళలకు అవకాశం కల్పించామని, ఏఐసీసీ అధ్యక్షురాలిగా కూడా మహిళలు పని చేశారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వంలో మహిళలకు తగిన గుర్తింపును ఇస్తున్నట్టు చెప్పారు. మంత్రుల నుంచి మొదలుకుని వివిధ శాఖల్లో ప్రత్యేక అధికారులుగా మహిళలనే నియమించామని వివరించారు. ఏసీబీ, విజిలెన్స్ లాంటి ముఖ్య విభాగాలతోపాటు ఎప్పుడూ పురుషులే ఉండే ఎస్‌ఐబీలో ఒక మహిళా అధికారికి అవకాశమిస్తే 700 మంది నక్సలైట్లు లొంగిపోయేలా ఆమె ప్రతిభ చూపించారని ప్రశంసించారు. అవకాశమిస్తే మహిళలు తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటారనే దానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని అక్కచెల్లెండ్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని




కల్పించటంతోపాటు వెయ్యి బస్సులకు వారిని యాజమానులను చేసి కార్పొరేట్ కంపెనీ లతో మహిళలు పోటీ పడేలా ప్రోత్సహిం చామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నా రు. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లకు వారిని యజమానులను చేసినట్టు చెప్పారు. మహిళా సంఘాల ఉత్పత్తులను మార్కెట్ చేసుకు నేందుకు వీలుగా హైటెక్ సిటీలో వెయ్యి కోట్ల విలువైన మూడున్నర ఎకరాల స్థలంలో 150 స్టాల్స్‌తో మహిళా శక్తి బజార్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయటానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని.. తమ కృషికి అందరూ సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని కాలుష్యరహితంగా, జీవనయోగ్య నగరంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. 2026 డిసెంబర్ నాటికి 2,800 ఆర్టీసీ డీజిల్ బస్సులను పూర్తిగా ఈవీలుగా మార్చబోతున్నట్టు తెలిపారు. రెండు లక్షల ఆటోలను ఈవీ కిందికి తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కళాశాలలకు వెళ్లే ఆడపిల్లలకు ఈవీ స్కూటీలను త్వరలోనే అందజేయబోతున్నామని వెల్లడించారు.హైదరాబాద్‌లో ప్రస్తుతమున్న ఎస్టీపీలు సరిపోవడం లేదని సీఎం తెలిపారు. చెత్త ఎత్తివేయడం, మూసీ ప్రక్షాళన, దోమల నియంత్రణ తదితర సమస్యలకు ఎలాంటి కార్యాచరణ అవసరమో చెప్పాలని మేధావులు, జర్నలిస్టులను కోరారు. సబర్మతీ, గంగానదిని ప్రక్షాళన చేసినప్పుడు మూసీ నదిని ఎందుకు ప్రక్షాళన చేయకూడదని ప్రశ్నించారు. నగరంలోని ఏడెకరాల్లో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో 50 శాతానికి పైగా బఫర్ జోన్‌లో ఉందని గుర్తు చేశారు. అయితే అక్కడి కొనుగోలుదారులు బాధితులుగా మారకుండా వారికి ప్రత్యామ్నాయ స్థలంతోపాటు భవన నిర్మాణ ఖర్చులు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చిందని గుర్తుచేశారు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ప్రతిపక్షాలు సానుభూతి కోసం రాజకీయాలు చేస్తు న్నాయని విమర్శించారు. ఎన్జీటీ రూల్స్‌ను తాను కూడా మార్చలేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంతో చర్చించకుండా, వారు గతంలో చేయని పనిని.. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేయొద్దనే దురుద్దేశంతో కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు.

# ఏఐను సమర్థవంతంగా వినియోగించాలి

మొదటి తరువాయి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన సమయంలో రాష్ట్రంలో తీవ్రవాదం విస్తృతంగా ఉండేదన్నారు. పోలీసు అధికారుల అలుపెరగని కృషి, త్యాగాలతో నేడు తీవ్రవాదం అంతమైందన్నారు. సెలవులు కూడా లేకుండా విధులు నిర్వర్తిస్తూ, ఎందరో అధి కారులు, సిబ్బంది ప్రాణత్యాగం చేశారని చెప్పారు. వారి సేవలకు ఎప్పటికీ గౌరవం ఉంటుందని కొనియాడారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా పోలీసింగ్ వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో ప్రజలకు వాస్తవంగా న్యాయం చేస్తున్నామా? లేదా? అని స్వీయ విమర్శ చేసుకోవాలని మంత్రి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు నమ్మకం కలిగించినప్పుడే వ్యవస్థకు గుర్తింపు వస్తుందన్నారు. ఈ రెండు రోజుల రిట్రీట్ ద్వారా సమీక్షించుకుని, తెలంగాణ పోలీస్ శాఖకు మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆయయన ఆకాంక్షించారు.

తెలంగాణ డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి మాట్లాడుతూ... రిట్రీట్‌లో జరిగే చర్చలు వాస్తవికతకు దగ్గరగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పోలీసుశాఖ లో చేపట్టాల్సిన సంస్కరణలపై మేధోమథనం జరగాలన్నారు. ఓపెన్ ఫోరంలో అధికారులు తమ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించి, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే ఈ




కార్యక్రమంలో అధికారులను ఆరు గ్రూపులుగా విభజించినట్టు తెలిపారు. వివిధ అంశాలపై లోతైన చర్చలు జరిపి నివేదికలు రూపొందిస్తామని వివరించారు. మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జనాభా పెరుగుతున్న నిష్పత్తికి తగ్గట్టు సిబ్బంది నియామకం ఎప్పుడూ సాధ్యపడదని, అందుకే అందుబాటులో ఉన్న వనరులతోనే పనితీరును ఎలా మెరుగుపరుచుకోవాలో యోచించాలన్నారు. ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ పోలీస్ అగ్రస్థానంలో ఉందని, ఆ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరో మాజీ డీజీపీ హెచ్.జె. దొర మాట్లాడుతూ.. అధికారులు తమ అనుభవాలను రంగరించి శాంతిభద్రతల పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేశ్ ఎం భగవత్, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ అనిల్ కుమార్, 'ఈగల్' డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేశ్ సహా పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కాగా ఈ పోలీస్ రిట్రీట్‌ను ఉమ్మడి ఏపీలో అప్పటి డీజీపీ హెచ్.జె దొర.. పోలీసు శాఖకు నాయకవత్వం వహించే ఐపీఎస్ అధికారులకు రిట్రీట్(పున:శ్చరణ) కార్యక్రమాన్ని మొదటిసారిగా ప్రారంభించారు. ఏడాది కాలంలో ఐపీఎస్ అధికారులు సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సమస్యలు, నూతన సవాళ్లు, వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజల విశ్వాసాన్ని మరింతగా చూరగొనడానికి పోలీసులు అందించాల్సిన సేవలు తదితర అంశాలపై ఈ రిట్రీట్‌ను నిర్వహించేవారు. అందుకోసం రిట్రీట్‌లోనే అధికారులతో అంతర్గత కమిటీలను వేసి, ఆయా అంశాలపై ఆ కమిటీలు చర్చించి చేసిన సిఫారసులను అమలు చేసే విషయమై దృష్టిని సారించేవారు. తాజాగా అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ఐపీఎస్‌ల రిట్రీట్ కార్యక్రమాన్ని తిరిగి చేపట్టింది. సోమవారం రిట్రీట్ ముగింపు సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు.

# గాయత్రి విద్యానికేతన్‌లో రంజాన్ ఈఫ్తార్ విందు



**పెద్దపల్లి, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గాయత్రి విద్యానికేతన్ హైస్కూల్‌లో ముస్లిం విద్యార్థుల తల్లిదండ్రులు మరియు డిగ్రీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఈఫ్తార్ విందు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని దేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై, పరస్పర స్నేహభావం, ఐక్యత, మానవతా విలువలను ప్రతిబింబించేలా విందు సంతోషోత్సాహాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ పండుగలు మత భేదాలను దాటి మనందరినీ ఒకటిగా కలిపే పవిత్ర సందర్భాలని పేర్కొన్నారు. కరస్పాండెంట్ రజని దేవి తల్లిదండ్రులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పాఠశాల--తల్లిదండ్రుల మధ్య బంధాన్ని మరింత బలపరచడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ఈ వేడుకలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆనందంగా జరుపుకున్నారు.

# మార్కెట్ స్థలాల రక్షణకు గొర్రెల కాపరుల పిలుపు



**పెద్దపల్లి, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొర్రెలు, మేకల మార్కెట్ యార్డ్‌లో ఈ నెల 10న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మన మార్కెట్ స్థలాలు -- మనమే కాపాడుకుందాం అనే నినాదంతో జరగనున్న ఈ చర్చా వేదిక వివరాలను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, జిల్లా అధ్యక్షుడు సలేంద్ర రాములు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. మార్కెట్ స్థలాల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా సాగే ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు, సంఘం ప్రతినిధులు, గొర్రెల కాపరులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ అమూల్యమైన సూచనలు, అభిప్రాయాలను పంచుకోవాలని వారు కోరారు.

# యూట్యూబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**పెద్దపల్లి, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ యూట్యూబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసిలేటి సదయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కొత్త కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా టాంక్ జై దేవ్--లడ్డు, గౌరవ జిల్లా అధ్యక్షులుగా బొడ్డుపల్లి రామ్మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోలి తిరుపతి, ఉపాధ్యక్షులుగా అడప మహేష్, వెన్నంపల్లి మల్లన్న, ప్రధాన కార్యదర్శిగా కంది సంపత్, కోశాధికారిగా పసిలేటి సదన్న, సంయుక్త కార్యదర్శులుగా ఆకుదారి వెంకటేష్, సలేంద్ర రాజయ్య, ప్రేమ్ సాగర్, గౌరవ సలహాదారుగా ఈర్ల రామన్న, ప్రచార కార్యదర్శిగా వడ్నాల తిరుపతి నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా రంగు నాగ నిఖిల్, ముత్యాల తిరుపతి, గుర్రాల సంతోష్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి సాగర్ రోడ్డులోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మంజులతో పాటు ఉపాధ్యాయులతో కేక్ కట్ చేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం జిల్లాలోని యూట్యూబర్ల సంక్షేమం కోసం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభం

**పెద్దపల్లి, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా ఆసుపత్రి పెద్దపల్లిలో 14 ఏళ్ల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యుడు విజయ రమణ రావు, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, వైస్ చైర్పర్సన్ ముస్కాన్ నాజ్ నియర్ అలీ, కౌన్సిలర్ కొట్టే స్వరూప తదితరులు ప్రారంభించారు. జిల్లా ఆసుపత్రి పెద్దపల్లి, సి.హెచ్.సి. మంథని, సి.హెచ్.సి. సుల్తానాబాద్, జనరల్ ఆసుపత్రి రామగుండం పరిధిలో మూడు నెలల పాటు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వ్యాక్సిన్ అందించబడుతుంది. 14 ఏళ్ల బాలికలు ఏజ్ ప్రూఫ్ కోసం ఐడీ కార్డ్‌తో పాటు తల్లిదండ్రులతో రావాలని, ఖాళీ కడుపుతో కాకుండా భోజనం చేసిన తర్వాతే టీకా వేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని బాలికలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జిల్లాలో సుమారు 7602 బాలికలకు ఈ వ్యాక్సిన్ అందించబడుతుందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్, డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ హెచ్‌పీవీ వైరస్ వల్ల గర్భాశయ క్యాన్సర్ రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా భారతీయ మహిళల్లో కనిపిస్తుందని, దీన్ని నివారించేందుకు ఈ టీకా అత్యంత ప్రభావవంతమని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 500 మిలియన్ల మందికి పైగా ఈ వ్యాక్సిన్ ఇవ్వబడిందని, తీవ్రమైన దుష్ప్రభావాలు లేవని, వృంధత్వం లేదా గర్భస్రావానికి కారణం అవుతుందనేది అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, వైస్ చైర్పర్సన్ ముస్కాన్ నాజ్ నియర్ అలీ, కౌన్సిలర్ కొట్టే స్వరూప, జిల్లా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆకుమడుపుల రజనీకాంత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



**తిమ్మాపూర్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కీ.శే.లు ఆకుమడుపుల రజనీకాంత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ట్రస్ట్ చైర్మన్ ఆకుమడుపుల నరేంద్ర స్వరూప్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ (ఎల్ఎండి కాలనీ)లో స్వాతంత్ర సమరయోధుల ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థుల కోసం ఆదివారం 8 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ రజనీకాంత్ జీవించి ఉన్న కాలంలో ఎన్నో సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించారని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచారని గుర్తుచేశారు. చిన్న వయసులో ఆయన అకాల మరణం బాధాకరమని, ఆయన సేవా గుణాన్ని కొనసాగించాలనే సంకల్పంతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు అన్నప్రసాదం వితరణ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆకుమడుపుల శ్రీనివాస్, ఆకుమడుపుల సంధ్యారాణి--రజనీకాంత్, కొట్టాల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ సోమనాదం కల్లూరి, టీఎన్జీవో నేతలు అంబటి నాగరాజు, పోలు కిషన్, గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి అంజిరెడ్డి, వార్డు సభ్యులు, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డీఈఓ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**కరీంనగర్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని ఏసీఎల్‌బీ ద డీఈఓ కార్యాలయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏసీఎల్‌బీ మేడం డా. అశ్విని తనాజీ వాఖడే కేక్ కట్ చేసి, సీఆర్పీలు మరియు డీఈఓ కార్యాలయ సిబ్బందికి బహుమతులు అందజేశారు. అనంతరం ఏడి మాధవి, ఏసీజీఈ సంధ్యారాణి డా. అశ్విని తనాజీ వాఖడేను సన్మానించారు. మేడం మాట్లాడుతూ మహిళల సాధికారత, వారి విధుల్లో భద్రత, ప్రోత్సాహం, అన్ని రంగాల్లో మద్దతు ఎంతో అవసరమని పేర్కొన్నారు. మహిళా సిబ్బంది తమ విధుల్లో చూపుతున్న అంకితభావాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు మిలుకూరి శ్రీనివాస్, కర్ర అశోక్ రెడ్డి, ఆంజనేయులు, మహేందర్ పాల్గొన్నారు. మహిళా సిబ్బంది అందరూ మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుక మహిళల గౌరవం, గుర్తింపు, సాధికారతను ప్రతిబింబించింది.

# ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారంకై మహాధర్నా

**పెద్దపల్లి, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



తెలంగాణ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఎస్పీడీసీఎల్ మింట్ కాంపౌండ్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు పెద్దపల్లి జేఏసీ చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 23,000 మంది ఆర్టిజన్ కార్మికులు సేవలందిస్తున్నప్పటికీ, ఒకే సంస్థలో రెండు రకాల సర్వీస్ నిబంధనలు కొనసాగడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఏపీఎస్ రూల్స్, కన్వర్షన్ ఉత్తర్వులు జారీ చేయాలని, అలాగే పీస్‌రేట్ మరియు అన్‌మాన్ కార్మికులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆర్టిజన్ కార్మికులు, స్పాట్ బిల్లర్లు, అన్‌మాన్ కార్మికులు పెద్ద సంఖ్యలో మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పోలీసు సిబ్బందికి ఘన సన్మానం



**కరీంనగర్ రూరల్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు నరేష్, లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మహిళా పోలీసు సిబ్బందికి శాలువాలు కప్పి సత్కారం చేశారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్ అధికారులు మండలంలోని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహిళా పోలీసులు కూడా మిగతా సిబ్బందితో సమానంగా రాత్రింబగళ్లు డ్యూటీలు నిర్వర్తిస్తున్నారని, వారి సేవలు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామాల్లో విద్యార్థినిలు, మహిళలకు భద్రత కల్పించడమే కాకుండా, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల ప్రమాదాలపై యువతకు చైతన్యం కల్పిస్తున్నారని తెలిపారు. మొబైల్ ఫోన్లలో అనవసరమైన పోస్టులు చేయకుండా జాగ్రత్తగా ఉండాలని, మహిళా పోలీసులు గ్రామాల్లో ఉండటం వలన మహిళా లోకం మరింత ధైర్యంగా, సంతోషంగా జీవిస్తున్నారని అధికారులు అభిప్రాయపడ్డారు.

# ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకొని పరిష్కరించడమే పథకం యొక్క లక్ష్యం



**మానకొండూర్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించడమే 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక' ఉద్దేశమని మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ 8వ డివిజన్ పరిధిలోని అల్లునూరులో ఆదివారం ఆయన శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వరకు గ్రావిటీ రోడ్ నిర్మాణ పనులకు, ఎర్రం లక్ష్మారెడ్డి ఇంటి వద్ద నుంచి వాగు వరకు చేపట్టబోయే డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే కాకుండా, ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకొని పరిష్కరించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. అల్లునూరులో అభివృద్ధి కోసం ఇప్పటికే అనేక పథకాల కింద నిధులు వెచ్చించామని తెలిపారు. ఇటీవల కరీంనగర్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ దృష్టికి రోడ్డు సమస్యను తీసుకెళ్లగా, వెంటనే మట్టి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం ముదావహమని పేర్కొన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య కూడా త్వరలోనే పరిష్కారం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్ కాల్వ మల్లేశం, కాంగ్రెస్ నాయకులు తమ్మనవేణి రమేశ్, గోపు మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ కంది అశోక్ రెడ్డి, పార్టీ నాయకులు కంది లక్ష్మీనారాయణ రెడ్డి, సింగిరెడ్డి స్వామి రెడ్డి, ఎస్. శ్రీనివాస్, కుంబాల లింగయ్య, అనోహర్, పడాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు. తరువాత మెండే రాధ--పోచయ్య దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ మున్సిపల్ కమిషనర్, సుడా చైర్మన్‌తో కలిసి పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



**మానకొండూర్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలో నూతనంగా నిర్మించనున్న వీవో భవన పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన సతీమణి, అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. కవ్వంపల్లి అనురాధతో కలిసి కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నదే ప్రభుత్వ అభిమతమని, వారు ఆకాశంలోనే కాకుండా అనేక రంగాల్లో అగ్రగాములుగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళల స్థితిగతులు బాగు పర్చేందుకు, ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఎమ్మెల్యే సతీమణి డా. అనురాధ మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున మాత్రమే కాకుండా ప్రతిరోజూ మహిళలను గౌరవించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఉద్దేశించిన పథకాల ద్వారా ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఉచిత విద్యుత్తు, రాయితీ గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు మగవారికి తీసిపోకుండా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై. శశికళ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఉట్కూరు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇల్లంతకుంట మండలం తాళ్లల్లపల్లి గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం భూమి పూజ చేశారు. పంచాయతీలకు సొంత భవనాలు నిర్మించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, అందులో భాగంగానే తాళ్లల్లపల్లి పంచాయతీ భవన పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. తిమ్మాపూర్ మండలం రేణికుంటలోని మన ఫార్మ్ కన్వెన్షన్ హాల్లో ఖాసింపేట్ గ్రామానికి చెందిన బద్దం పద్మ--రాజేశ్వర్ రెడ్డి దంపతుల కుమార్తె వివాహ వేడుకకు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయన సతీమణి డా. అనురాధ హాజరై అక్షితలు వేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా బీజేపీ నేత వ్యాఖ్యలు




**జగిత్యాల, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాల నియోజకవర్గ బీజేపీ కార్యాలయం కమల నిలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. భోగ శ్రావణి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. అయితే, రాజకీయాల్లో మహిళలను అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. డా. శ్రావణి మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే కేంద్రం అభివృద్ధికి సహకరించడం లేదని ఆరోపిస్తున్నప్పటికీ, రోల్లవాగు ప్రాజెక్ట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని కేంద్ర మంత్రివర్యులు లిఖితపూర్వకంగా వెల్లడించారని తెలిపారు. అలాగే నగరవాణి యోజన కింద జగిత్యాలకు 2 కోట్లు మంజూరు కాగా, 1.4 కోట్లు విడుదలయ్యాయని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు వివరాలు సమర్పించకపోవడంతో మిగిలిన 60 లక్షలు విడుదల కాలేదని వివరించారు. ఎంపీ అరవింద్ కృషితో ఎన్‌హెచ్ 61, 63 కింద బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు, అలాగే కేంద్ర విద్యాలయం కోసం నిధులు మంజూరయ్యాయని, కానీ పది ఎకరాల స్థలం ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆమె విమర్శించారు. మామిడి మార్కెట్‌కు 25 ఎకరాలు ఇచ్చిన ప్రభుత్వం, విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర విద్యాలయానికి స్థలం ఇవ్వలేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రయాణం గురించి మాట్లాడుతూ, అధికారం కోసం పార్టీలు మారలేదని, ప్రజల ఆశీర్వాదంతోనే బీజేపీలో చేరానని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి జగిత్యాలకు 60 కోట్ల నిధులు వచ్చినా అవి ఎక్కడ వినియోగమవుతున్నాయో ప్రజలకు తెలియదని, అభివృద్ధి, సంక్షేమమే బీజేపీ ఎజెండా అని ఆమె అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కౌన్సిలర్లు వేముల శ్రీనివాస్, నిమ్మల నాగరాజు, గట్టిపెల్లి మానస--జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శులు ఆముదరాజు, సిరికొండ రాజన్న, ఇట్యాల రాము, పవన్ సింగ్, రవితేజ, కాశెట్టి తిరుపతి, కడార్ల లావణ్య, సింగం పద్మ, మామిడాల కవిత, బద్దల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**హుస్నాబాద్ మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో మహిళా వార్డు సభ్యులు, గ్రామస్థాయి మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న అంగన్‌వాడి కార్యకర్తలు, వీవోలు, మహిళా సంఘాల అధ్యక్షులు, పారిశుద్ధ్య కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ పథకం కింద ఎక్కువ పని దినాలు పూర్తి చేసిన ఇద్దరు మహిళలను ప్రత్యేకంగా శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అలువాల శంకర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, సమాజ సంక్షేమంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారు అన్ని రంగాల్లో ముందుకు సాగి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మహిళల కృషి, సేవలను గౌరవించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల సేవలను గుర్తించి గౌరవించడం గ్రామానికి గర్వకారణంగా నిలిచిందని, భవిష్యత్తులో కూడా మహిళల సాధికారత కోసం పంచాయతీ తరఫున మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ వేడుకలో ఉప సర్పంచ్ కానవేణి జితేందర్, వార్డు సభ్యులు కొత్త మధు, కోల ప్రభాకర్, కోల రజిత, స్వరూప, సుధగోని రమాదేవి, ఇందిర, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పూర్తయిన మొదటి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం



**హుస్నాబాద్ , మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పథకంలో భాగంగా మొట్టమొదటిసారిగా ఒక ఇల్లు నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఉల్లంపల్లి గ్రామానికి చెందిన పబ్బ కవిత--సమ్మయ్య దంపతులు ప్రభుత్వ సహకారంతో నిర్మించుకున్న కొత్త ఇంటిలో శుభప్రదంగా గృహప్రవేశం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అలువాల శంకర్, ఉపసర్పంచ్ జితేందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కానవెని శివకుమార్, ఎస్సీ అధ్యక్షుడు కోలా సంపత్, కొండప పురుషోతమ్, బుర్ర సంపత్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అలువాల శంకర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా పేదలకు పక్కా ఇళ్లు అందుతున్నాయని, ఇది ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# బైక్ కొనివ్వలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థి



**కరీంనగర్ రూరల్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రూరల్ మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన ఐటీఐ మొదటి సంవత్సరం విద్యార్థి రిత్విక్ (17) బైక్ కొనివ్వలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి సాయిని తిరుపతి అప్పులు తీర్చిన తర్వాత పంట డబ్బులు వచ్చిన పిమ్మట బైక్ కొనిస్తానని చెప్పగా, మిత్రులందరికీ బైకులు ఉండగా తనకు ఇవ్వలేదని బాధపడుతూ రిత్విక్ గడ్డి మందు తాగాడు. తల్లి, తండ్రులు గమనించి కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రులకు తరలించినా, ఆదివారం ఉదయం 7.30 గంటలకు యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రిత్విక్ తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్న కుటుంబంలో ఏకైక కుమారుడి మరణం విషాదాన్ని మిగిల్చింది. మృతుడి శవాన్ని చూడటానికి గోపాలపూర్ గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకున్నారు.

## భట్రాజు మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



**కరీంనగర్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లో భట్రాజు మహిళా సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు స్వరూప, మంజులాదేవి, రమ తదితరులు మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, మహిళల ఐక్యతతో సమాజంలో మరింత పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 70 ఏళ్లు దాటిన మహిళలను ప్రత్యేకంగా సన్మానించడం ద్వారా వారి సేవలను గుర్తించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులకు కేంద్ర మంత్రితో బహుమతుల ప్రధానం




**హుస్నాబాద్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ హుస్నాబాద్ కోకో జట్టు విజేతలుగా నిలిచింది. ఆదివారం రోజున కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం విద్యార్థులకు గర్వకారణమని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటతీరు పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేసినట్లు ప్రిన్సిపల్ పంచదార శ్రీదేవి తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో పార్లమెంట్ స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణించాలని మంత్రి ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్వోడీలు శ్రీను, ఇందు, గీతారాణి, ఓస్ వెంకటేశం, కళాశాల ఇంచార్జ్ పి.డి. మోహన్ నాయక్, ఉపన్యాసకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల విషయంలో జరుగుతున్న అన్యాయాల పై విచారణ జరపాలి




**హుస్నాబాద్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మండలంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల విషయంలో జరుగుతున్న అన్యాయాలపై నేషనల్ నవ క్రాంతి పార్టీ జాతీయ కార్యదర్శి లంకసిరి రాజ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ విరుద్ధంగా అధికారులు, ఉద్యోగులు స్వార్థపూరిత ఆలోచనలతో వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రవాణా శాఖ మంత్రి మా వెనుక ఉన్నారని చెప్పుకుంటూ ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేయడం, నిరుద్యోగులకు అన్యాయం చేయడం వంటి చర్యలు సహించబోమని హెచ్చరించారు. త్వరలోనే రాజకీయ నాయకులైనా, మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా ప్రజా ఆస్తులను కబ్జా చేసినవారిని చట్టపరంగా చెమటలు పట్టిస్తామని, ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని లంకసిరి రాజ్‌కుమార్ స్పష్టం చేశారు.

# మహిళా సాధికారత కోసం సమాన హక్కుల పిలుపు



**హుస్నాబాద్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మై భారత్, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ దండు లక్ష్మి కొమురయ్య మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమాజహిత కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని, సమాన హక్కుల సాధన కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేక అధికారి రాగుల మమతా యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. అలాగే ఉపాధ్యాయురాళ్లకు శాలువాలు కప్పి సత్కారం చేశారు. జిల్లా యువజన క్రీడా అధికారి జంగాపల్లి వెంకట నరసయ్య మాట్లాడుతూ మహిళలు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, ఆటలు ఆరోగ్యానికి మూలమని గుర్తించారు. సంకల్ప సంస్థ అధ్యక్షుడు వలస సుభాష్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, సావిత్రిబాయి పూలే వంటి ఆదర్శవంతమైన మహిళామూర్తులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తరి పద్మా రవీందర్, కౌన్సిలర్ సావుల మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండు లక్ష్మి పాడిన పాట సభలో ఆకర్షణీయంగా నిలిచింది. వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్పీవీ టీకా కార్యక్రమం ప్రారంభం




**సిద్దిపేట, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కోమటి చెరువు వద్ద జరిగిన ఈ వేడుకకు జిల్లా కలెక్టర్ హైమావతి, మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రతి ఇంటి బాధ్యత మహిళ హక్కు అని, దానిని సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పుట్టింటిలో మహిళకు మొదటి దైవం తల్లి అని పేర్కొన్నారు. వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అత్తమామలను తల్లిదండ్రుల వలే చూసుకోవడం ప్రతి మహిళ బాధ్యత అని అన్నారు. మహిళలు ప్రతిరోజూ మహిళా దినోత్సవంలా ఆనందంగా, సుభిక్షంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంబిటస్ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, మహిళా కౌన్సిలర్లు బింగి బాల్ లక్ష్మి, బందారం శ్రీలత, అంబిటస్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, మెప్మా అధికారి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా సిద్దిపేట గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో హెచ్పీవీ టీకా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 6 కేంద్రాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని, 14 సంవత్సరాల వయస్సు గల 10,147 మంది బాలికలందరూ హెచ్పీవీ టీకా తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఒకే డోస్‌తో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారించవచ్చని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ధనరాజ్, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డా. శ్రీనివాస్, ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్ బాబ్జి, సిహెచ్ఐ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. దీప్తి ప్రియాంక, డా. శ్రీకాంత్, ఆర్ఎంఓ డా. జ్యోతి, డా. సదానందం, డా. శ్రావణి, డా. సురేష్ బాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ గా శ్రీనివాస్ గౌడ్ ను నియమించాలి

- గౌడ సంఘం యువజన నాయకుడు వెంకటేష్ గౌడ్



**ఆమనగల్లు, మార్చి 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ గా టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ను నియమించాలని ఆమనగల్లు గౌడ యువజన సంఘం నాయకులు మారేపల్లి వెంకటేష్ గౌడ్ కోరారు. ఆదివారం ప్రకటనలో వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయతగా ఉంటూ సేవ చేస్తున్న కల్వకుర్తి నియోజకవర్గ సీనియర్ నాయకులు, పీసీసీ కార్యవర్గ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ కు రాష్ట్ర కల్లుగీత కార్పోరేషన్ చైర్మన్ గా నియమించాలని తెలిపారు. పార్టీలో అవకాశాలు వచ్చిన రాకున్నా కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ అహర్నిశలు కృషి చేస్తున్న శ్రీనివాస్ గౌడ్ సేవలను గుర్తించి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి లను ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

## పరిశుభ్రతపై అవగాహన సదస్సు



**అమ్రాబాద్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా అమ్రాబాద్ మండల కేంద్రంలో పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిగుర్ల కోటయ్య మాట్లాడుతూ గ్రామంలో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్లలో వేయాలని ప్రజలను కోరారు. అలాగే ప్రతి ఇంట్లో మురుగు నీరు వీధుల్లోకి రాకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అమరేశ్వర దేవాలయం చైర్మన్ తిప్పర్తి శ్రీనివాసులు, నోముల జగన్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, రవి, గ్రామపంచాయతీ సిబ్బంది ఇసాక్, వెంకటయ్య పాల్గొన్నారు.

## మూడు తరాల మహిళలతో మహిళా దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దండు కుటుంబం మూడు తరాల మహిళలు (అమ్మ--అత్త--కోడళ్లు) కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. "మహిళలు చదువుతో పాటు అన్ని రంగాలలో, ముఖ్యంగా రాజకీయాలలో ముందుకు రావాలి. త్వరలో కల్పించే రిజర్వేషన్‌ను సంపూర్ణంగా వినియోగించుకోవాలి" అని వారు పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో జనరల్ రిజర్వేషన్‌లో పోటీ చేసిన దండు రజిత శ్రీనివాస్ గౌడ్‌ను అభినందిస్తూ, "ఓటమి చెందినా అధైర్యపడకుండా భవిష్యత్తు అవకాశాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి" అని సూచించారు. మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు, రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి మాట్లాడుతూ, "మహిళల గొంతు వినిపించాలి. సమాజంలో వారి పాత్ర అత్యంత ముఖ్యం. విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. మహిళలపై దాడులు ఆగాలి" అని అన్నారు.

## రాజీవ్‌నగర్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**బోడుప్పల్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాజీవ్‌నగర్ కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దానగాళ్ల అనిత యాదగిరి మహిళలకు శాలువాలు కప్పి సన్మానం చేసి, కేక్ కట్ చేసి అందరితో పంచుకున్నారు. "మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు, అంతరిక్షంలోకీ విజయవంతంగా వెళ్తున్నారు. ఎక్కడైతే స్త్రీ గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువుంటారు" అని ఆమె అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దానగాళ్ల యాదగిరి మాట్లాడుతూ, "నా డివిజన్ మహిళలు నాకు అక్కచెల్లెల్లతో సమానం. ప్రతి మగాడి వెనుక ఒక మహిళ ఉంటుంది. పదవిలో ఉన్నంతకాలం మీ అందరికీ అందుబాటులో ఉంటాను" అని పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూమ్ మహిళా నాయకురాలు ఆర్.పి. ఇదుల రేణుక మాట్లాడుతూ, "సంవత్సరంలో మహిళలకు వచ్చే ఏకైక పండుగ మహిళా దినోత్సవం. ఈ వేడుకను నిర్వహించిన అసోసియేషన్‌కు ధన్యవాదాలు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళా లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ బెస్ట్ సైకాలజిస్టు అవార్డు అందుకున్న డా. నోముల వెంకటేశ్వర్లు



**హైదరాబాద్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో సర్ సి.వి. రామన్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన 38వ సేవా ఉగాది మహోత్సవంలో హయత్‌నగర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రముఖ సైకాలజిస్టు డా. నోముల వెంకటేశ్వర్లు "తెలంగాణ బెస్ట్ సైకాలజిస్టు అవార్డు--2026" అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు గోల్డ్ మెడల్, స్వర్ణ ఘంటా కంకణం, ట్రోఫీ, సర్టిఫికేట్‌తో ఘన సన్మానం జరిగింది. గత 15 సంవత్సరాలుగా మానసిక ఆరోగ్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, వేలాది విద్యార్థులు, కుటుంబాలకు కౌన్సెలింగ్, రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదనంగా 50కు పైగా ఉచిత వైద్య--మానసిక ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా లక్ష మొక్కలను పంపిణీ చేశారు. రేడియో, టీవీ, పత్రికా వ్యాసాలు, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా విస్తృత ప్రచారం చేశారు. ఇప్పటికే ఆయనకు జాతీయ, రాష్ట్ర స్థాయి అనేక అవార్డులు లభించాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, డా. కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఎమ్.యూ.ఎన్ సమావేశానికి విద్యార్థి అనన్య ఎంపిక



**సిద్దిపేట, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సింగన్నగూడ జడ్పీ హైస్కూల్ విద్యార్థిని అనన్య రాష్ట్రస్థాయి మోడల్ ఐక్యరాజ్యసమితి సమావేశానికి ఎంపిక కావడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని హెడ్‌మాస్టర్ మొహమ్మద్ రహీమ్ తెలిపారు. ఆమె ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, అంతర్జాతీయ అంశాలపై అవగాహనకు గుర్తింపుగా ఈ ఎంపిక జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థులలో నాయకత్వం, కమ్యూనికేషన్ నైపుణ్యం, ప్రపంచ అవగాహన పెంపొందించడంలో మోడల్ ఐక్యరాజ్యసమితి కీలకమని అన్నారు. అనన్య ఎంపికలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు డా. దేవులపల్లి పర్శరాముల కృషి ఎంతో ఉందని హెడ్‌మాస్టర్ అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సవిత ఆంజని విద్యార్థిని అనన్యను శుభాకాంక్షలు తెలిపారు.

## వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ మార్చి 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
చింతపల్లి మండలంలోని గోడుకొండ్ల, వెంకటేశ్వర నగర్ (మాల్) గ్రామంలో నిర్వహించిన శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొని, స్వామి వారిని దర్శించుకొని, వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు దేవరకొండ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, స్వామి దయా కరుణా కటాక్షాలతో దేవరకొండ శాంతి, సుభిక్షాలతో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు .గ్రామ నాయకులు, వేద పండితులు అందించిన ఆత్మీయ స్వాగతానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గోడుకొండ్ల మాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. పోలేపల్లి రాంనగర్ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ వనమైసమ్మ తల్లి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

-- మహిళ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన సామాజికవేత్త, బి.సి.సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్.



**దేవరకొండ మార్చి 08. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలో జాతీయ బి.సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దేవరకొండ నియోజకవర్గంలో, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మరియు సామాజిక సేవ దృక్పథం కలిగిన మహిళ ప్రముఖులను గుర్తించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, సమాజంలో సేవ చేస్తూ అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తూ, సమాజంలో అగ్రగామిగా ఉంటూ చాలా మంది మహిళలను చైతన్యపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిరెడ్డి సంధ్య రెడ్డి, పుణుగురి లింగయ్య, రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేశ్, చేరిపల్లి జయలక్ష్మి, పెరికేటి శ్రీనివాస చారి, పున్న బిక్షమయ్య, భీమగోని శివ గౌడ్, వనం చంద్రకళ, బి.సి హాస్టల్ వార్డెన్ (బాలికలు) రేణుక, డాక్టర్ విజయ, డాక్టర్ శశికళ, డాక్టర్ రుణాదేవి, శిరీష, సావిత్రి, ఎం.ఏ ఖాలిక్, శిగ శ్రీనివాస్, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉ సన్మానాన్ని పొందిన మహిళలు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగాధరలో మహిళా దినోత్సవ వేడుకలు



**గంగాధర, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురనగర్ చౌరస్తాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కిట్టు పార్టీ మహిళామణులు కలిసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని, ఐక్యతతో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు.

## బస్టాండ్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరం



**హుస్నాబాద్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ బస్టాండ్‌లో తరచూ జరుగుతున్న దొంగతనాలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల సెల్‌ఫోన్లు, విలువైన వస్తువులు తరచూ దొంగల బారిన పడుతున్నాయని, ఆర్టీసీ పోలీసులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. రెండు కోట్ల రూపాయలతో బస్టాండ్ ఆధునికీకరణ జరగడం హర్షణీయమే కానీ, "మూడవ కన్ను"గా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల దొంగలు నిర్భయంగా వస్తువులు అపహరిస్తున్నారని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. వెంటనే జిల్లా ఆర్‌ఎం, హుస్నాబాద్ డిఎం స్పందించి బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యపై స్థానిక ఏసీపీ, సిఐ, ఎస్ఐల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు కవ్వ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రజల భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## హెచ్పీవీ టీకా మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచం



**అమ్రాబాద్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్రాబాద్ మండలంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 14 సంవత్సరాలు నిండిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం హెచ్పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అమ్రాబాద్ సర్పంచ్ చిగుర్ల కోటయ్య పాల్గొన్నారు. హెచ్పీవీ టీకా -- మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచం అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారు. అమ్రాబాద్, మన్ననూర్ ప్రాంతాల వైద్యులు, నర్సులు, ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని వారు ఆకాంక్షించారు.

## ఈనెల 10న గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయం ముందు టీపీటీఎఫ్ నిరసన

**హైదరాబాద్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 10న కమిషనర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేపడుతున్నామని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి తెలిపారు. పండిట్, పీఈటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉన్నతీకరించాలని, కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్లను రెగ్యులరైజ్ చేసి టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, వేతనాలు సకాలంలో చెల్లించాలని, బదిలీలు--పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలను 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయడం, అన్ని సబ్జెక్టుల టీచర్ల నియామకం, ఖాళీల భర్తీ, వసతి గృహాలకు హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో కదిలిరావాలని టీపీటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు.

# హెచ్పివి వ్యాక్సిన్‌తో బాలికలకు గర్భాశయ ద్వార క్యాన్సర్ రక్షణ



**నల్లగొండ, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ జిల్లా ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రిలో 14--15 ఏళ్ల బాలికలకు హెచ్పివి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.మొదటి దశలో 21 వేల మంది బాలికలకు టీకా వేయనున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. తల్లిదండ్రుల సమక్షంలో టీకా వేసి, ఆధార్ ఆధారంగా నమోదు చేసి సర్టిఫికెట్లు అందజేస్తారు. జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో వ్యాక్సిన్ ఉచితంగా అందుబాటులో ఉంటుందని, ప్రైవేట్ సెంటర్లలో ఖర్చు చేయాల్సి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. "ప్రతి అర్హ బాలిక టీకా తీసుకుని ఆరోగ్యంగా ఉండాలి. వ్యాక్సిన్ వల్ల క్యాన్సర్‌ను నివారించవచ్చు" అని కలెక్టర్, మేయర్ వ్యాఖ్యానించారు."మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం బాగుంటుంది" అని మేయర్ అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా. పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు నాగలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, అల్లి సుభాష్, వైద్యులు పుల్లారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పూజిత అపార్ట్మెంట్లో ఘనంగా ఉప్పలమ్మ పండుగ



**నల్లగొండ, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పూజిత అపార్ట్మెంట్లో ఉప్పలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. అపార్ట్మెంట్ అధ్యక్షుడు దేవులపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, "గత 25 సంవత్సరాలుగా అపార్ట్మెంట్ వాసులు ఉప్పలమ్మ పండుగను పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నారు" అని తెలిపారు.ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, సుమారు 1500 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, అపార్ట్మెంట్ ప్రధాన కార్యదర్శి కత్తుల యాదగిరి, కార్యవర్గ సభ్యులు తరాల దేవయ్య, కత్తుల రవీందర్, శ్రవణ్‌కుమార్, గౌరవ సలహాదారులు సోమయ్య, డాక్టర్ నాల్ల వెంకటేశ్వర్లు, సద్గురు ప్రసాద్, లెంకల సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రావు, బిక్షం రెడ్డి, ఇంద్రయ్య, అపార్ట్మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తిని తక్కువ అంచనా చేయవద్దు

**సర్పంచ్ రాయికంటి విజయ్‌కుమార్**



**యాచారం, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యాచారం మండల వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పలు సంఘాల ఆధ్వర్యంలో కేకులు కోసి, మహిళలకు సన్మానం చేశారు.నందివనపర్తి గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా సర్పంచ్ రాయికంటి విజయ్‌కుమార్, విహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అధ్యక్షులు నూకం కృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాయికంటి విజయ్‌కుమార్ మాట్లాడుతూ, "మహిళలు సమాజ నిర్మాణానికి బలమైన పునాది. మహిళల సాధికారతే సమాజ అభివృద్ధికి దారి చూపుతుంది. వారు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, మహిళా సంఘాలు, విద్యా కమిటీ చైర్మన్--వైస్ చైర్మన్, రేషన్ డీలర్లు, యువజన సంఘాల నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొంగరి యాదగిరి, ప్రధాన కార్యదర్శి యంజాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం

**-- సంఘటిత పోరాటాలకు సంకేతం**




**నల్లగొండ, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, వ్యకస, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నల్లగొండ యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా సదస్సు జరిగింది.ఈ సదస్సుకు ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు తుమ్మల పద్మ, కుంచెం కావ్య, శ్రీవాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ, "మహిళా దినోత్సవం అనేది కేవలం శుభాకాంక్షలు, బహుమతులతో ముగిసే రోజు కాదు. ఇది కార్మిక మహిళల చెమట, ధైర్యం, పోరాటాలతో చెక్కబడిన చరిత్ర. సమాన హక్కుల సాధన కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన మహిళల త్యాగాలను స్మరించుకునే రోజు" అని అన్నారు.ప్రస్తుతం దేశంలో పెరుగుతున్న ఫాసిస్టు ధోరణుల నేపథ్యంలో మహిళా ఉద్యమాలు మరింత బలంగా రావాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ పేద మహిళల జీవనాధారంగా ఉన్న ఉపాధి



హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని విమర్శించారు.దేశవ్యాప్తంగా జరిగిన కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాల్లో మహిళలు కీలక పాత్ర పోషించారని, అదే స్ఫూర్తితో మహిళా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్, ఐద్వా జిల్లా నాయకురాలు జిట్టా సరోజ, కొండ అనురాధ, భూలక్ష్మి, చెనబోయిన నాగమణి, సుల్తానా, గోలి వెంకటమ్మ, బహిరోజు ఇందిరా, మంజుల, పుష్ప, గుండాల నరేష్, కిరణ్, అవుటా రవీందర్, స్పందన, కీర్తన, షాలిని, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలి

**సర్పంచ్ సామ అశ్విని రవీందర్ రెడ్డి**



**ఇబ్రహింపట్నం, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా బలోపేతం కావాలని తులేకలాన్ గ్రామ సర్పంచ్ సామ అశ్విని రవీందర్‌రెడ్డి ఆకాంక్షించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామంలో వివిధ రంగాల్లో స్థిరపడిన మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ, "మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా బలపడాలి" అని పేర్కొన్నారు.గ్రామానికి చెందిన చిలుకల సత్యనారాయణ--అరుణ దంపతుల కుమార్తె బాస్కెట్‌బాల్‌లో జాతీయస్థాయిలో ఎంపిక కావడంతో ఆమెను ప్రత్యేకంగా సన్మానించారు. "ఒక నిరుపేద కుటుంబం నుంచి జాతీయస్థాయిలో ఎంపిక కావడం గర్వకారణం" అని సర్పంచ్ అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఉపసర్పంచ్ జగదీష్, సిపిఎం జిల్లా నాయకులు బోడ సామేల్, దయ్యాల కిషన్, వార్డు సభ్యులు అచ్చున మౌనిక, బోడ కృష్ణకుమారి, హనుమండ్ల ఆంజనేయులు, సుర్వి జనార్దన్ గౌడ్, బోడ స్కైలాబ్, జక్కుల అర్చన, బండి సంతోష, గజ్జెల మహేష్, సత్తు సింహాద్రి రెడ్డి, అంగన్వాడీ టీచర్లు దయ్యాల యాదమ్మ, సామ సంతోష, విద్యా కమిటీ అధ్యక్షురాలు దాచపల్లి కమలమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ జక్కుల యమున, విలేజ్ బుక్‌కీపర్లు దయ్యాల భాగ్యమ్మ, బాకారం మంజుల, మహిళా సంఘం అధ్యక్షురాలు లచ్చగారి మమత, కార్యదర్శి కలకొండ పద్మ, సభ్యులు సామ మంజుల, బిఆర్ఎస్ నాయకులు ఆదర్ల బాషా, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**- ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి**



**కడ్తాల్, మార్చి 8 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్రరెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కాసేపు ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిఫల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి ఆశీర్వదించడమే దీనికి నిదర్శమన్నారు. పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ పేద ప్రజలను పట్టించుకోలేదని,పేదలకు సంక్షేమ పథకాలను అందించలేకపోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తోందని, అర్హులందరికి నూతన రేషన్ కార్డులతో పాటు, రేషన్ ద్వారా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తోందని గుర్తు చేశారు. దీంతో పాటు గృహజ్యోతి ద్వారా 200 యూనిట్లు గృహవసరాలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని చెప్పారు. పేదలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. క్షేత్ర స్థాయిల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి బ్లాక్కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు షాబుద్దిన్, చెన్నయ్య, జగన్ తదితరులు ఉన్నారు.

# ప్రజాపాలన--ప్రగతి డ్రైవ్‌లో అవగాహన కార్యక్రమం

**ఎలిగేడు, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి కార్యక్రమంలో భాగంగా 99 రోజుల ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా ఎలిగేడు గ్రామంలో అవగాహన కార్యక్రమం జరిగింది. గ్రామస్తులకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంపై



ఇంటింటికీ వెళ్లి సూచనలు చేశారు. టీ షాపులు, హోటళ్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, వివోస్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.


# సృష్టికి మూలం ప్రగతికి ప్రాణం

-అంతర్జాతీయమహిళాదినోత్సవము
మహిళలందరికీ శుభాకాంక్షలు
-రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్
చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్



**కడ్తాల్, మార్చి 8 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
కడ్తాల్ మండలం హనుమస్ పల్లి గ్రామపంచాయతీకి చెందిన కాళ్ల ప్రమీల కృష్ణ కు మహిళల దినోత్సవం సందర్భంగా ఆదివారం సన్మానించి ఆమె ఇంటి స్లాబ్ కు కావలసినంత సిమెంట్ ఇప్పియ్యడం జరిగింది. ఈ సందర్భంగా కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ మహిళలు బాగుంటేనే కుటుంబం రాష్ట్రం దేశం బాగుంటుంది అని ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని తను గాఢంగా నమ్ముతానని ఆయన అన్నారు. ప్రతి ఏడాది మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవం జరుపుకుంటారని మహిళా సాధికారిక ను తెలియజేసే విధంగా హనుమాస్ పల్లి గ్రామ పంచాయతీకి చెందిన కాళ్ల ప్రవీణ కృష్ణ వారి ఇంటి స్లాబ్ కు కావలసిన సిమెంటు తన రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించడం జరిగిందని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీను నాయక్, ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, కుమార్, వార్డు సభ్యులు ప్రశాంత్, దేవ్,నాయక్, నాయకులు జేడిఎన్ వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్, రవి, శంకర్,కృష్ణ,మహేష్, జంగయ్య,మైసయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ శుభాకంక్షాలు



**కడ్తాల్, మార్చి 8 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమనగల్లు మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణిని ఘనంగా శాలువాతో సత్కరించి మహిళా దినోత్సవ శుభాకంక్షాలు తెలిపారు. ఈ సందర్బంగా మహిళలు అన్ని రంగాల్లో రానించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికపై అవగాహన కల్పించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**వెల్దండ, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక (99 రోజుల ప్రణాళిక)లో భాగంగా మూడవ రోజు కార్యక్రమం జరిగింది. ఇంటింటి చెత్త సేకరణలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించే విధంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఉపసర్పంచ్ బస్నమోని శీను, వార్డు సభ్యులు గోసులకొండయ్య, పాలది రంగనాథం, గుద్దటి కిస్టల్, రేవల్లి రాజు, మారేపల్లి శ్రీను, ముదికొండ రమేష్, మసిగుండ్ల వెంకటేష్, బాదేపల్లి రమేష్, శేఖర్, ఈదులపల్లి వెంకటయ్య, కార్యదర్శి గిరి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ముందస్తు నివారణ చర్యలు- శుభపరిణామం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**షాద్‌నగర్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళల్లో వేగంగా విస్తరిస్తున్న గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన హెచ్‌పీవీ టీకా కార్యక్రమం మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఆసుపత్రి వైద్యులు ఆధ్వర్యంలో మొదటి టీకా డోసు బాలికకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రస్తుతం క్యాన్సర్ మహమ్మారి పెరుగుతోంది. దీనిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. బాలికలు తమ తల్లిదండ్రులతో ఆధార్ కార్డు తీసుకుని ఆరోగ్య కేంద్రానికి వచ్చి టీకా వేయించుకోవాలి. వివరాలు యువిన్ పోర్టల్‌లో నమోదు చేసి, అభా ఐడీ ఆధారంగా టీకా వేస్తారు. వెంటనే సర్టిఫికేట్ కూడా జారీ అవుతుంది" అని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వం, వైస్‌చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్‌రెడ్డి, కౌన్సిలర్లు మురళీమోహన్, దిలీప్, బచ్చలి నరేష్, ముబారక్ అలీ ఖాన్, గంగమని సత్తయ్య, శ్రీనివాస్, మధవులు, ఖదీర్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- రావిచేడ్ సర్పంచ్ గోపాల్



**కడ్తాల్, మార్చి 8 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాలు దరిచేరవని రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ అన్నారు. ఆదివారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తడి, పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బందరి యాదయ్య, వార్డు సభ్యులు హనుమంతు నాయక్, భూపతి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు బాలకృష్ణ, సాయికుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతి, తదితరులున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ



**బల్మూర్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బల్మూర్ మండల పరిధిలోని గోదల్ గ్రామానికి చెందిన బత్కమ్మ తిరుపతయ్య నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, డిసిసి అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం. పేద ప్రజలకు గృహ నివాస వసతి కల్పించేందుకు ఈ పథకం అమలవుతోంది. ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇల్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. "ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం" అని ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## వివాహ వేడుకలలో పాల్గొన్న వంశీచంద్ రెడ్డి



**కడ్తాల్, మార్చి 8 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్ కూతురు వివాహ వేడుకలలో పాల్గొన్న సి డబ్ల్యూ సి ప్రత్యేక ఆహ్వానితులు, కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు చల్లా వంశీ చంద్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు యాట నర్సింహా,గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బిచ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ పారాయణ గీతం ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈనెల 22న జరగనున్న శ్రీ వాసవి మహాశక్తి మహోత్సవంలో పాడబోయే వాసవీ మాత పారాయణ గీతంను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం ఆవిష్కరించారు. ఈ గీతాన్ని డాక్టర్ చింతల శ్రీనివాస్ రచించగా, గాయని కల్పన స్వరపరిచి ఆలపించారు. తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత గుప్తా ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియంలో 30 వేల మందికి పైగా ఆర్యవైశ్యులు సామూహికంగా పారాయణం చేయనున్నారని ఆమె వెల్లడించారు. ఇది ప్రపంచ రికార్డు కానుందని కల్వ సుజాత మంత్రి సురేఖకు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, "ఈ మహోత్సవం విజయవంతం కావాలి. నిర్వాహకులు చేసిన కృషి అభినందనీయం" అని ఆకాంక్షించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బెల్ది శ్రీధర్, రమాకాంత్, నాగేశ్వరరావు, సంతోష్, సంపత్, చైతన్య, సాంబశివరావు, రమేష్, దీప్తి, కవిత, నిఖిత, హారిక, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**కడ్తాల్, మార్చి 8 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్పల్లి గ్రామ శివారులో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, కడ్తాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గానుగమర్ల తండాకు చెందిన గంస్య నాయక్ ( 47 ) ద్విచక్ర వాహనంపై అన్మాస్పల్లి వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాంస్య నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు కడ్తాల్ పోలీసులు తెలిపారు.



ఎలిగేడు లో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు.

# డీసీపీ కార్యాలయంలో డిజిటల్ ఎఫ్ఐఆర్ శిక్షణ



**షాద్‌నగర్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫ్యూచర్ సీటీ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో పోలీసు అధికారులకు కేసుల దర్యాప్తుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో కీలక అంశాలపై చర్చించారు. గొడవలు, దాడులు జరిగినప్పుడు కేసులు ఎలా నమోదు చేయాలి, సాక్ష్యాలను ఎలా సేకరించాలి అనే విషయాలను నందిగామ ఎస్ఐ యాదయ్య, ఏఎస్ఐ శ్రీనివాస్ వివరించారు. ఐటీ విభాగానికి చెందిన పీసీ బాలరాజు వినూత్న విధానాన్ని పరిచయం చేశారు. ఇకపై ఘటన జరిగిన చోటు నుంచే డిజిటల్ పద్ధతిలో ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానంపై అధికారులకు అవగాహన కల్పించారు. డిజిటల్ సాక్ష్యాల సేకరణ వల్ల కేసుల విచారణ వేగవంతం అవుతుందని, బాధితులకు త్వరగా న్యాయం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ జోన్ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి

- కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్



**ఆమనగల్లు, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్ పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సంకటోనిపల్లిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆయన ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళలకు తినిపించారు. శాలువాతో ఘనంగా సత్కరించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, పురుషులతో సమానంగా ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో పోటీ పడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కమటం రాధామ్మ వెంకటయ్య, నాయకులు దేవరశెట్టి మహేష్, ప్రతాప్, గ్రామ సంఘం లీడర్లు స్వాతి, లక్ష్మమ్మ, మనీలా, చంద్రకళ, లత, కవిత, భాగ్యమ్మ, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దు

వైస్‌చైర్మన్ తల్లోజు గీత ఆచారి



**ఆమనగల్లు, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లులో పేరుకుపోయిన ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు మున్సిపల్ వైస్‌చైర్మన్ తల్లోజు గీత ఆచారి తెలిపారు. ఆదివారం పట్టణంలోని 3వ వార్డులో పర్యటించి పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనేజీలు, వీధులను శుభ్రం చేయించారు. చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పారిశుద్ధ్య పనులను సమర్థవంతంగా చేపట్టాలని, చెత్త సేకరణలో అశ్రద్ధ చేయొద్దని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్, బిజెపి సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు హత్యా నాయక్, సక్రూ నాయక్, రమేష్, శివరాం, మోతిలాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతతోనే నవ సమాజ నిర్మాణం



**ఫరూఖ్‌నగర్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం, పాడి మహిళా రైతులతో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన హెరిటేజ్ ఫుడ్స్ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా స్వశక్తితో ఆర్థికంగా ఎదిగి సమాజంలో ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. గత 34 ఏళ్లుగా పాల ఉత్పత్తి రంగంలో హెరిటేజ్ సంస్థ అప్రతిహతంగా కొనసాగుతోందని, ఈ విజయప్రస్థానంలో 50 శాతం వాటా మహిళలదేనని స్పష్టం చేశారు. మహిళల నాయకత్వం, ధైర్యం, మేనేజ్‌మెంట్ సామర్థ్యం అభినందనీయమని కొనియాడారు. ప్రస్తుతం సంస్థకు మహిళా రైతులు ప్రతిరోజూ మూడు లక్షల లీటర్ల పాలను అందజేస్తూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని ఆమె హర్షం వ్యక్తం చేశారు. పశువైద్య శిబిరం ద్వారా పశువుల ఆరోగ్యం, నాణ్యమైన పాల ఉత్పత్తిపై నిపుణులు రైతులకు అవగాహన కల్పించారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ముఖ్యంగా పాడి పరిశ్రమలో ఆధునిక మెలకువలు నేర్చుకుంటూ ముందుకు సాగాలని భువనేశ్వరి ఆకాంక్షించారు. ఒక మహిళ ఆర్థికంగా స్థిరపడితే కుటుంబంతో పాటు గ్రామం, రాష్ట్రం, చివరకు దేశమే బాగుపడుతుందని ఆమె ఉద్ఘాటించారు. మహిళా భద్రత అంశంపై భువనేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళల రక్షణ అనేది కేవలం మాటలకే పరిమితం కాకూడదని, అది ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని, తద్వారా నేరస్థుల్లో భయం కలగాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పకడ్బందీ రక్షణ చట్టాలను అమలు చేయాలని, మహిళలు నిర్భయంగా తిరిగే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్నారులు పాడిన గీతాలు అలరించగా, అనంతరం తెలంగాణ జాతీయ గీతాన్ని ఆలపించారు. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో మహిళా పాడి రైతులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సంబశివరావు, పాల సేకరణ శాఖాధిపతి రామ్మోహన్‌రావు, రైతు సంక్షేమ అధికారి డా. బానోతు శ్రీను, హైదరాబాద్ రీజియన్ అధికారి కే.బీ. నర్సింగ్‌రావు, నందిగామ బ్రాంచ్ అధికారులు నరేష్, స్వామి గౌడ్, వెటర్నరీ డాక్టర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సన్మానం



మహిళా దినోత్సవ సందర్భంగా ఎలిగేడులో మహిళా ప్రజా ప్రతినిధులకు ఉద్యోగులకు సన్మానం చేస్తున్న గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ పాలకవర్గం.



రేకల్లోపల్లిలో మహిళా దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళా ప్రజా ప్రతినిధులను సన్మానించిన గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్.


**ఎలిగేడు, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎలిగేడు, ధూళికట్ట, రేకల్దేవ్‌పల్లి గ్రామపంచాయతీలలో వేడుకలు ఘనంగా జరిగాయి. సర్పంచులు కప్పల ప్రవీణ్, మారం కొమురయ్య, రమాదేవి సంపత్ ఆధ్వర్యంలో మహిళలను శాలువాలతో సన్మానించి గౌరవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావాలని, సమానత్వం కోసం పురుషులు మహిళా సాధికారతపై అవగాహన




దూళికట్టలో మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలను సన్మానిస్తున్న సర్పంచ్ మారం కొమురయ్య.

పెంపొందించుకోవాలని సూచించారు. "స్త్రీ లేకపోతే సృష్టి లేదు" అనే నినాదంతో మహిళల త్యాగాలు, కృషిని గుర్తిస్తూ ఈ సంవత్సరం "గివ్ టు గేన్" అనే ఉద్దేశంతో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముంజం నరేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతకుంట మనోహర్‌రావు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి అంజలి, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇండియా, చైనా ప్రత్యర్థులు కాదు..



**న్యూఢిల్లీ మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత్, చైనా దేశాలు పరస్పరం ప్రత్యర్థుల్లా కాకుండా భాగస్వాములుగా ఉండాలని చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ వ్యాఖ్యానించారు. అదేవిధంగా ఒకరికొకరు ముప్పు అని భావించకుండా అభివృద్ధికి తోడ్పడే అవకాశంగా చూడాలన్నారు. వార్షిక మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా సంబంధాలను మెరుగుపర్చుకునే విషయానికి ఇరుదేశాలు కట్టుబడి ఉండాలని సూచించారు. 2024లో కజాన్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల సమావేశం జరిగిందని, అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందని వాంగ్ యీ చెప్పారు. గత ఏడాది తియాంజిన్‌లో ఇరుదేశాల నేతలు మరోసారి భేటీ అయిన తర్వాత మరింత మెరుగుదల కనిపించిందని తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయికి చేరుకోవడం, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడటం వంటివి ఇరుదేశాలకూ ప్రయోజనం చేకూర్చాయిని అన్నారు. భారత్, చైనా సత్సంబంధాలు, స్నేహాన్ని కాపాడుకోవాలని, సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించాలని, అభివృద్ధిపై దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. పొరుగు దేశాలుగా, గ్లోబల్ సౌత్ సభ్యులుగా, భారత్, చైనా దీర్ఘకాలిక సంబంధాలు కలిగి ఉన్నాయని వాంగ్ అన్నారు. పరస్పర విశ్వాసం, సహకారం అనేవి రెండు దేశాల అభివృద్ధికి ప్రయోజనకరంగా ఉంటాయని చెప్పారు. విభజనవాదం, ఘర్షణలు అభివృద్ధిని దెబ్బతీస్తాయని అన్నారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు సైన్యాల మధ్య జరిగిన ఘర్షణతో ఇరుదేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే పలు దఫాలుగా చర్చలు జరిపిన భారత్, చైనా దేశాలు పరిస్థితులను చక్కదిద్దేందుకు చర్యలు తీసుకున్నాయి.

# బిజినెస్

## ఈ లోన్లు మహిళల కోసమే..
# ప్రభుత్వ రుణ పథకాలను పరిశీలిద్దామా!

## ఎన్‌పీఎస్ స్వస్థ్యతో వైద్య నిధి



పెరుగుతున్న వైద్య ఖర్చులను అధిగమించేందుకు తమ ఖాతాదారుల కోసం నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) స్వస్థ్య పేరిట పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్డీఏ) ఓ పైలట్ ప్రాజెక్ట్‌ను తీసుకొచ్చింది. ఈ స్వచ్ఛంధ పథకం ద్వారా మీ పెన్షన్ ఖాతా పరిధిలోనే ప్రత్యేకంగా ఓ ఆరోగ్య సంరక్షణ నిధిని నిర్మించుకోవచ్చు. ఎన్‌పీఎస్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నిధిలో నగదు మొత్తాల జమ ఉంటుంది.దీనికి మార్కెట్ ఆధారిత వృద్ధిని చూడవచ్చు. అయితే ఒకవేళ ఈ పెట్టుబడులపై వచ్చే రాబడులు ఆశించిన స్థాయిలో ఉండకపోతే మీ నిధులను మళ్లీ మీ ప్రధాన ఎన్‌పీఎస్ ఖాతాలోకి ఎలాంటి నష్టం లేకుండా బదిలీ కూడా చేసుకోవచ్చు. ఇక రెగ్యులర్ ఎన్‌పీఎస్ ఖాతా కలిగిన భారత పౌరులు ఎవరైనా దీనికి అర్హులే. వైద్య అవసరాల కోసం ఎప్పుడైనా ఎలాంటి ఆంక్షలు లేకుండా నగదు ఉపసంహరణలు చేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో నిబంధనలకు లోబడి 100 శాతం నగదును వెనుకకు తీసుకోవచ్చు. ఈ స్కీమ్‌లో కార్పస్ ఫండ్ రూ.50 వేలు దాటితేనే తొలి ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.

ప్రధాన మంత్రి ముద్ర యోజన పూచీకత్తు లేకుండా వాణిజ్య, తయారీ, సేవా రంగాలకు చెందిన సూక్ష్మ, చిన్న సంస్థలు ఈ పథకం కింద గరిష్ఠంగా రూ.20 లక్షలదాకా రుణాలు పొందవచ్చు. ఇందులో శిశు, కిశోర్, తరుణ్, తరుణ్ ప్లస్ అనే నాలుగు విభాగాలుంటాయి. శిశు కింద రూ.50 వేలదాకా, కిశోర్‌లో రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు, తరుణ్‌లో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు లోన్లు తీసుకోవచ్చు. ఒకసారి తరుణ్ కేటగిరీలో లోన్ తీసుకుని చెల్లిస్తే.. తరుణ్ ప్లస్ విభాగం కింద మళ్లీ రూ.20 లక్షలదాకా లోన్‌కు అర్హులవుతారు. వడ్డీపైనా రాయితీలుంటాయి.

స్టాండప్ ఇండియా గ్రీన్‌ఫీల్డ్ సంస్థల్ని ప్రారంభించేందుకు మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌కు రూ.10 లక్షల నుంచి కోటి రూపాయల మధ్య రుణ



సదుపాయం కల్పిస్తారు.

ఉద్యోగిణి గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌కు పూచీకత్తు లేకుండా రాయితీ వడ్డీపై రూ.3 లక్షలదాకా రుణాలిస్తారు.

మహిళా ఉద్యమ్ నిధి అనువైన చెల్లింపు పద్ధతుల్లో చిన్నచిన్న వ్యాపారాలను ప్రారంభించేందుకు మహిళలకు ఈ పథకంలో రుణాలుంటాయి.

అన్నపూర్ణ ఫుడ్ క్యాటరింగ్ రంగంలోని మహిళల కోసం ఉద్దేశించిన పథకం.

న్యూ స్వర్ణిమ వెనుకబడిన తరగతులకు చెందిన మహిళల అభ్యున్నతికి తక్కువ వడ్డీకే రూ.2 లక్షలదాకా రుణ సాయం అందుతుంది.

మహిళా సమృద్ధి యోజన 4 శాతం వార్షిక వడ్డీతో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి, వెనుకబడిన తరగతి మహిళలకు సూక్ష్మ రుణాలు లభిస్తాయి.

ఎస్బీఐ ద్వారా స్త్రీ శక్తి యోజన, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా సెంట్ కల్యాణి స్కీమ్‌లున్నాయి. చిన్న, సూక్ష్మ వ్యాపారాలకు తక్కువ వడ్డీకే పూచీకత్తు లేని రుణాలు వస్తాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తదితర బ్యాంకులూ వివిధ పథకాల ద్వారా మహిళలకు ఆకర్షణీయ వడ్డీరేట్లకే రూ.75 లక్షల నుంచి కోటిదాకా రుణాలిస్తున్నాయి.

# హెచ్‌డీఎఫ్‌సీ రుణాలు చౌక

న్యూఢిల్లీ, మార్చి 8

ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్..రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఈ తగ్గింపు శనివారం నుంచి అమల్లోకి వచ్చిందని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు నుంచి మూడేండ్ల లోపు కాలపరిమితి కలిగిన రుణాలు మరింత చౌకగానున్నాయి. దీంతో బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.15 శాతం నుంచి 8.55 శాతం లోపు దిగొచ్చాయి. అంతకుముందు ఇది 8.25 శాతం నుంచి 8.60 శాతం లోపు ఉండేది. దీంతో ఎంసీఎల్ఆర్‌తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లు మరింత తగ్గనున్నాయి.





**ఎఫ్‌డీలపై వడ్డీ పెంపు**

డిపాజిట్‌దారులకు కూడా బ్యాంక్ ఊరటనిచ్చింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్టు ప్రకటించింది. దీంతో డిపాజిట్లపై బ్యాంక్ వడ్డీరేటు 2.75 శాతం నుంచి 6.50 శాతం వరకు సాధారణ ఖాతాదారులకు చెల్లించనుండగా, సీనియర్ సిటిజన్లకు 3.25 శాతం నుంచి 7 శాతం లోపు చెల్లించనున్నది. అలాగే మూడేండ్ల నుంచి నాలుగేండ్ల ఏడు నెలల్లోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు సవరించింది. దీంతో డిపాజిట్లపై వడ్డీరేటు 6.40 శాతం నుంచి 6.50 శాతానికి పెరిగింది. రూ.3 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లకు మాత్రమే పెరిగిన వడ్డీరేటు వర్తించనున్నదని పేర్కొంది.

## ప్రేయసితో నిశ్చితార్థం..
# 'నా పర్ఫెక్ట్ ఇన్నింగ్స్' అంటున్న భారత క్రికెటర్..!

భారత జట్టుకు దూరమైనా.. దేశవాళీలో మెరుస్తున్న పృథ్వీ షా త్వరలోనే ఇంటివాడు కాబోతున్నాడు. కొన్ని రోజులుగా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆకృతి అగర్వాల్ తో ప్రేమలో మునిగి తేలుతున్న ఈ డాషింగ్ బ్యాటర్ నిశ్చితార్థం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో ఆదివారం వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ వైభవంగా జరిగింది. సినిమా నటి అయిన ఆకృతికి ఉంగురం తొడిగిన ఫొటలోను ఈ డాషింగ్ బ్యాటర్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. నా పర్ఫెక్ట్ ఇన్నింగ్స్ అనే క్యాప్షన్ జోడించాడు షా.ఇటీవల కాలంలో ఆటకంటే వివాదాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలిచిన పృథ్వీ షా ఎంగేజ్‌మెంట్ ఫొటోలతో మరోసారి నెట్టింట వైరలవుతున్నాడు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆకృతి అగర్వాల్‌తో పలు సందర్భాల్లో కెమెరా కంటపడిన




షా.. ఎట్టకేలకు తమ బంధాన్ని బహిర్గతం చేశాడు. తాజాగా సచిన్ తనయుడు అర్జున్ టెండూల్కర్ పెళ్లితో జంటగా తళుక్కమన్న ఆకృతి, పృథ్వీ షా ఆదివారం నిశ్చితార్థంతో పెళ్లికి వేళైందని సిగ్నల్ ఇచ్చారు.లేత నీలం రంగు షేర్వానీలో షా మెరిసిపోగా.. ఎర్రని డిజైనర్ లెహెంగా ధరించిన ఆకృతి దేవకన్యలా వయ్యారాలు పోయింది. ఈమధ్యే త్రిముఖ సినిమాతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన ఆకృతిని ఇన్‌స్టాగ్రామ్‌లో 30 లక్షల మందికి పైగా అనుసరిస్తున్నారు.జూనియర్ స్థాయిలో సంచలన ఆటతో మరో సచిన్ టెండూల్కర్‌గా ప్రశంసలందుకున్న పృథ్వీ షా.. ఊహించని విధంగా పాతాళానికి పడిపోయాడు. క్రమశిక్షణ కరువై, ఫిట్‌నెస్, ఫామ్ కోల్పోవడంతో అతడి కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది. ఐపీఎల్‌లోనూ నిరాశపరిచిన షా.. ఎట్టకేలకు దేశవాళీ సీజన్ 2025-26తో టచ్‌లోకి వచ్చాడు. ముంబై నుంచి మహారాష్ట్ర జట్టుకు మారిన అతడు.. పరుగుల వరదతో లయ అందుకున్నాడు. దాంతో.. ఐపీఎల్ 19వ సీజన్ మినీ వేలంలో షాను కనీస ధరకే ఢిల్లీ క్యాపిటల్ దక్కించుకుంది.

# లక్ష్యసేన్ రన్నరప్

**- ఫైనల్లో లిన్ చున్ చేతిలో ఓటమి**

**బర్మింగ్‌హామ్ (ఇంగ్లాండ్)**

ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్, ఒలింపియన్ లక్ష్యసేన్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. 2022లో టైటిల్‌కు అడుగు దూరంలో ఆగిపోయిన లక్ష్యసేన్.. 2026లోనూ రన్నరప్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో చైనీస్ తైపీ షట్లర్ లిన్ చున్ చేతిలో లక్ష్యసేన్ వరుస గేముల్లో ఓటమి చెందాడు. 15-21, 22-20తో లిన్ చున్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. 57 నిమిషాల్లో ముగిసిన ఫైనల్లో లక్ష్యసేన్ ఆశించిన ప్రదర్శన కనబరచలేదు. రెండో గేమ్‌లో ప్రత్యర్థిని ఒత్తిడిలో పడేసిన లక్ష్యసేన్.. లిన్ చున్ తప్పిదాలు చేసేలా



ఉసిగొల్పాడు. 3-4 నుంచి వరుసగా ఆరు పాయింట్లు సాధించిన లక్ష్యసేన్ 9-4తో ముందంజ వేశాడు. లిన్ చున్ వేగంగా పుంజుకున్నాడు. టైబ్రేకర్‌కు దారితీసిన రెండో సెట్‌ను 22-20తో సొం తం చేసుకున్న లిన్ చున్ ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌గా నిలిచాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో హాంగ్ వీ, నికోలె (చైనీస్ తైపీ) జోడీ విజేతగా నిలువగా.. మహిళల డబుల్స్‌లో షెంగ్, టాన్ నింగ్ (చైనా) జంట టైటిల్ ఎగరేసుకుపోయింది.

# స్పోర్ట్స్

# నా సక్సెస్ వెనుక 'సచిన్' మంత్రం..




2026 టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా సగర్వంగా మువ్వన్నెల జెండాను ఎగురవేసింది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల భారీ తేడాతో గెలిచి భారత్ విశ్వవిజేతగా నిలిచింది. ఈ టోర్నీలో భారత్ తరపున వెలుగులీనిన ధృవతార సంజూ శాంసన్. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో 80కి పైగా పరుగులు సాధించి, ఫైనల్‌లో కేవలం 46 బంతుల్లో 89 పరుగులు చేసిన సంజూను 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' వరించింది.

**సచిన్ సలహాతోనే ఈ మార్పు..**

మ్యాచ్ అనంతరం తన అద్భుత ఫామ్ గురించి సంజూ శాంసన్ ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. తన బ్యాటింగ్‌లో నిలకడ లేదనే విమర్శలకు చెక్ పెట్టడానికి క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ సలహాలే కారణమని వెల్లడించాడు. ఈ క్రమంలో శాంసన్ మాట్లాడుతూ..

'టోర్నీకి ముందు నేను మానసికంగా కొంత ఒత్తిడిలో ఉన్నాను. ఆ సమయంలో సచిన్ సార్‌కు ఫోన్ చేశాను. ఆయన నా బ్యాటింగ్ పొజిషన్, మెంటల్ అప్రోచ్ గురించి కొన్ని విలువైన సూచనలు చేశారు. బంతిని చూసి సహజ సిద్ధంగా ఆడమని ఆయన చెప్పిన మాటలు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి," అని సంజూ పేర్కొన్నాడు.

**నిలకడకు మారుపేరుగా..**

గతంలో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి వెంటనే అవుట్ అయ్యే సంజూ, ఈ టోర్నీలో మాత్రం బాధ్యతాయుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. ఫైనల్‌లో న్యూజిలాండ్ బౌలర్లను ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతూనే, ఇన్నింగ్స్‌ను చక్కగా నిర్మించాడు. ఫలితంగా భారత్ భారీ స్కోరు సాధించి, కివీస్‌ను కట్టడి చేయగలిగింది.

సచిన్ మార్గదర్శకత్వం, సంజూ ప్రతిభ తోడవ్వడంతో టీమిండియా మరో ఐసీసీ ట్రోఫీని తన ఖాతాలో వేసుకుంది